

సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వం జనరల్ ఆసుపత్రి







బెస్తవాళ్ల జాతరలో బోనమెత్తిన జోగిని నిషారాణితో జగ్గారెడ్డి, కూతురు జయారెడ్డి, బోనమెత్తిన నిర్మలా జగ్గారెడ్డి, జయారెడ్డి, చిరునవ్వులు చిందిస్తున్న జగ్గారెడ్డి

బెస్తోల్ల బోనాల జాతర

పాల్గొన్న జగ్గారెడ్డి, సతీమణి నిర్మల, కూతురు జయారెడ్డి, కుమారుడు భరత్ సాయిరెడ్డి, జోగిని నిషారాణి

సంగారెడ్డి టౌన్, జూలై 28 : సంగారెడ్డి పట్టణంలో ఆషాఢమాసం సందర్భంగా నిర్వహించిన దుర్గమ్మ తల్లి బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని బెస్తోల్ల ఆధ్వర్యంలో జరిగిన బోనాల జాతర ఉత్సవాల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డితోపాటు ఆయన సతీమణి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, కూతురు జయారెడ్డి, కుమారుడు భరత్‌సాయిరెడ్డి, జోగిని నిషారాణి పాల్గొన్నారు. వేలాదిగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపు అట్టహాసంగా జరిగింది. వందలాది మంది కళాకారులు వివిధ దేవతా మూర్తుల వేషధారణలో అలరించారు. పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోతరాజులతో కలిసి జగ్గారెడ్డి, భరత్‌సాయిరెడ్డిలు చేసిన నృత్యాలు అభిమానులు, భక్తుల్లో జోష్‌ను నింపాయి. జోగిని నిషారాణి బోనం ఎత్తుకుని చేసిన నృత్యం ఆకట్టుకున్నది. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. పట్టణమంతా అమ్మవారి నామస్మరణతో మార్మోగింది.



రోడ్లపై నాట్లు వేసి నిరసన

అక్కన్నపేట మండలం పంతులుతండా, పిక్కతండా, ధరావత్ తండాకు సరైన రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం తండావాసులు రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీటిలో నాట్లు వేసి నిరసన తెలిపారు. తమ తండాలకు వెళ్లేందుకు రహదారులు సరిగా లేవని ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వస్తే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని చెప్పారు. వాహనదారులు, పాదచారులు బురదలో పడి గాయాలపాలవుతున్నారని వాపోయారు. ఇప్పటికే పలుమార్లు నాయకులకు, అధికారులకు మొరపెట్టుకున్నామని, అయినా ఏ ఒక్కరూ పట్టించుకోలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి తమ తండాలకు రోడ్డు వేయించాలని తండావాసులు, బీజేపీ గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు రైనా నాయక్ కోరారు.

- అక్కన్నపేట, జూలై 28

జీజీహెచ్‌లో గలీజు!

- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా జీజీహెచ్‌లోని 4వ ఫ్లోర్
- ఎక్కడ పడితే అక్కడ వాడేసిన కండోమ్‌లు
- కరువైన అధికారుల పర్యవేక్షణ



ఆసుపత్రిలోని నాలుగో అంతస్థులో వాడిన కండోమ్‌లు, ప్యాకెట్లు

సిద్దిపేట టౌన్, జూలై 28: రోగులకు వైద్యమందించాల్సిన ఆసుపత్రిలో అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయి. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాల నిత్యం రోగులతో కిటకిటలాడుతుంది. రూ.కోట్లు వెచ్చించి 300 పడకలతో సకల సౌకర్యాలు, వసతులు కల్పించారు. అయితే, కొందరి వికృత చేష్టల వల్ల ఆసుపత్రి అపకీర్తిని మూటగట్టుకుంటున్నది. ఆసుపత్రిలోని ఓ ఫ్లోర్‌లో కండోమ్‌లు ఎక్కడపడితే అక్కడ కనిపిస్తున్నాయి.

సిద్దిపేటలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాల భవనంలో మొత్తం నాలుగు ఫ్లోర్‌లున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఓపీ, గైనకాలజీ, రక్త పరీక్షాకేంద్రం, స్కానింగ్, ఈసీజీ, మొదటి ఫ్లోర్‌లో గైనకాలజిస్ట్ వార్డు, పిల్లల విభాగం, ఆపరేషన్ థియేటర్, నవజాత శిశు కేంద్రం, రెండో ఫ్లోర్‌లో జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్ విభాగం, మూడో ఫ్లోర్‌లో డయాగ్నోస్టిక్ డిపార్ట్‌మెంట్, ప్యాథాలజీ, మైక్రోయాలజీ కేంద్రాలున్నాయి. నాలుగో ఫ్లోర్‌లో పాలియేటివ్, క్యాన్సర్ విభాగాలు ఏర్పాటు చేశారు. మూడు ఫ్లోర్లు కూడా నిత్యం రోగులు, వైద్యులు సిబ్బందితో కిటకిటలాడుతుంటాయి. ఇక నాలుగో ఫ్లోర్‌లో పాలియేటివ్, క్యాన్సర్‌కు సంబంధించిన రోగులు లేకపోవడంతో కొన్నినెలలుగా ఖాళీగానే ఉంటుంది. ఆ ఫ్లోర్‌లో సీసీ కెమెరాలు లేకపోవడం, అటు వైపు ఎవరూ వెళ్లకపోవడంతో దీన్నే ఆసరాగా చేసుకున్న కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. అందుకు ప్రభుత్వాసుపత్రిలో ఉండే కండోమ్ ప్యాకెట్లను ఉపయోగిస్తున్నారు. ఆ తర్వాత వాటిని ఎక్కడ పడితే అక్కడ పడేస్తూ ఆసుపత్రి పేరును చెడగొడుతున్నారు. నిత్యం వేలాది మందితో రద్దీగా ఉండే ఆసుపత్రిలో ఇలాంటి పనులు చేసేది ఎవరై ఉంటారని సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న వారా..? లేక చికిత్స కోసం వచ్చే రోగులా..? లేదంటే వారి బంధువులా..? అంటూ గుసగుసలాడుకుంటున్నారు. పాత ఏరియా ఆసుపత్రి భవనంలో కూడా కండోమ్ ప్యాకెట్‌లు లభించడంపైనా వారు చర్చించుకుంటున్నారు.



కొరవడిన పర్యవేక్షణ

గతంలో సిద్దిపేట ప్రభుత్వాసుపత్రిలోని ప్రతీ ఫ్లోర్‌లో కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండేది. మెడికల్ కళాశాల తరగతులను కొన్ని నెలల పాటు ఇక్కడే నిర్వహించేవారు. కొన్నేళ్ల క్రితం సిద్దిపేటలోని ఎన్సాన్‌పల్లి శివారులోని మెడికల్ కళాశాల భవన నిర్మాణం పూర్తి కావడంతో అక్కడికి మార్చారు. దీంతో నాలుగో ఫ్లోర్‌లో పాలియేటివ్ కేర్, క్యాన్సర్ రోగుల కోసం పలు సౌకర్యాలు, వసతులను ఏర్పాటు చేసి కేటాయించారు. మొదట్లో బాగానే ఉన్నా రోగులు ఆ ఫ్లోర్‌కు రావడం తగ్గించడంతో సిబ్బంది, వైద్యులు, అధికారులు అటువైపే వెళ్లడం మానేశారు. దీంతో ఆ ఫ్లోర్‌లో అసాంఘిక పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఆ ఫ్లోర్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, వికృత చేష్టలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పోతారంలోని మహంకాలమ్మ ఆలయంలో కొత్తప్రభాకర్‌రెడ్డి

మంత్రి పొన్నంకు అభివృద్ధిపై అవగాహన లేదు

- రాష్ట్ర మంత్రుల పరిస్థితి కూడా అంతే..
- ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపైనే శ్రద్ధ
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జూలై 28: రాష్ట్ర మంత్రులకు వారి వారి శాఖలపై అవగాహన లేదని, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు టీజీ ఆర్టీసీపై, జిల్లా సమగ్రాభివృద్ధిపై అవగాహన లేదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం దుబ్బాక మండలం పోతారంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై, మంత్రులపై మండిపడ్డారు. జిల్లా మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్ ఉన్న అభివృద్ధి నిధులను, బస్‌లతో కలిపి హుస్నాబాద్‌కే తరలించుకుని పోతున్నారని ఆరోపించారు. రాష్ట్ర, జిల్లా సమగ్రాభివృద్ధిని విస్మరించి, కేవలం హుస్నాబాద్‌కే మంత్రిగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడుస్తున్నా జిల్లాకు సంబంధించిన, నియోజకవర్గాలకు సంబంధించి అభివృద్ధి సమీక్షలు నిర్వహించలేదన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు నిధులివ్వకుండా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. శాసనసభ సమావేశాల్లో దుబ్బాక నియోజకవర్గ సమస్యలపై నిలదీస్తానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి అవినీతి, ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై ఉన్న శ్రద్ధ సంక్షేమం, అభివృద్ధిపై లేదన్నారు. దుబ్బాకలోని మైసమ్మ ఆలయం, పోతారంలోని మహంకాలమ్మ ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాల జాతరలో పాల్గొన్నారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, కొత్త అంజిరెడ్డి, గుండెల్లి ఎల్లారెడ్డి, బానాల శ్రీనివాస్, ఆసస్వామి, బంగారయ్య వంశీకృష్ణ, దేవుని రాజు, పర్షరవి ,దుబ్బాక ముదిరాజ్ సంఘం నాయకులున్నారు.



అమ్మకు బోనం..

- జోర్దార్‌గా ఊరేగింపులు శివసత్తుల శిగాలు..
- పోతరాజుల విన్యాసాలు
- హాజరైన ప్రముఖులు

7లో

ఉరిమే ఉత్సాహం..



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

రంగనాయకసాగర్ ప్రాజెక్టు కట్టపై పరుగెత్తుతున్న రన్నర్స్

- రంగనాయకసాగర్‌పై 21కె, 10కె, 5కె రన్
- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నా, పెద్దా
- హాఫ్ మారథాన్‌లో పాల్గొని స్ఫూర్తి నింపిన అంధుడు
- డయాబెటిక్ ఇండియాను హెల్త్ ఇండియాగా మార్చాలి
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



ప్రాజెక్టు కట్టపై నిలిచిన వర్షం నీరు

చిన్నకోడూరు, జూలై 28 : చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ ప్రాజెక్టు కట్టపై ఆదివారం సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెకండ్ ఎడిషన్ హాఫ్ మారథాన్ ఉత్సాహంగా సాగింది. ఈ హాఫ్ మారథాన్‌లో చిన్నా, పెద్దా పాల్గొన్నారు. గతేడాది ఆగస్టు 6న ఫస్ట్ ఎడిషన్ హాఫ్ మారథాన్ (21కె) నిర్వహించగా, నిన్న సెకండ్ ఎడిషన్ నిర్వహించారు. 21కె, 10కె, 5కె రన్‌ను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ హాఫ్ మారథాన్‌లో వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి, వృద్ధులు, మహిళలు, యువత, చిన్నారులు సుమారు 3వేల మంది ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉత్సాహంగా పరుగెత్తారు. ఓ అంధుడు తన స్నేహితుడి సహాయంతో ఈ హాఫ్ మారథాన్‌లో పాల్గొని అందరికీ స్ఫూర్తిగా నిలిచాడు.



ప్రాజెక్టు కట్టపై నిలిచిన వర్షం నీటిలో పరుగెత్తుతున్న చిన్నారులు

ప్రతిరోజూ ఓ గంట మైదానంలో ఉండాలి

డయాబెటిక్ ఇండియాను హెల్త్ ఇండియాగా మార్చాలంటే ప్రతి ఒక్కరూ రోజు ఉదయం గంటసేపు మైదానంలో ఉండాలని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. భారతదేశ జనాభా చైనాను దాటి ప్రపంచంలో దాదాపు నంబర్‌వన్ స్థానానికి చేరుకుందన్నారు. భారతదేశంలో డయాబెటిక్ పేషంట్లు కూడా పెరుగుతున్నారని చెప్పారు. ప్రస్తుతం మనల్ని మనం రక్షించుకోవడానికి మనముందున్న మార్గం క్రీడలని ఆయన పేర్కొన్నారు. క్రీడల్లో మనకు నచ్చిన క్రీడలను ఎంచుకుని వాటిలో సక్సెస్ అయ్యేలా ముందుకెళ్లాలని సూచించారు. నేటి చిన్నారులే రేపటి బావిభారత పౌరులని, వారంతా శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటేనే దేశం బాగుటుందన్నారు. దేశాన్ని పట్టిపీడిస్తున్న మహమ్మారి డ్రగ్స్ అని, బంగారు భవిష్యత్ ఉన్న యువత డ్రగ్స్ వైపు వెళ్లకూడదన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన ఖేలో ఇండియా స్ఫూర్తిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈసారి జరిగే ఒలంపిక్స్‌లో భారతదేశం అత్యధిక పతకాలను సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం వచ్చే ఏడాది (2025) నిర్వహించే హాఫ్ మారథాన్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపురెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉత్సాహంతో కేరింతలు కొడుతున్న చిన్నా పెద్దా



వేషధారణలో కళాకారులు

వర్షం నీటితో ఇబ్బందులు పడ్డ రన్నర్స్

రంగనాయకసాగర్ ప్రాజెక్టు కట్టపై వర్షం నీరు నిల్వడంతో రన్నర్స్ అసౌకర్యానికి గురై ఇబ్బందులు పడ్డారు. ఒకింత అసహనం వ్యక్తం చేశారు.

ఫస్ట్ ప్లేస్‌లో నిలవడం సంతోషంగా ఉంది

- ఉమా, సూర్యపేట జిల్లా.



మాది సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండలం లింగంపల్లి గ్రామం డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్నాను. నేను సిద్దిపేటలో హాఫ్ మారథాన్‌లో పాల్గొనడం ఇది రెండవ సారి. గతేడాది నిర్వహించిన హాఫ్‌మారథాన్‌లో మహిళల విభాగంలో మొదటి స్థానం వచ్చింది. రెండవసారి కూడా మొదటి స్థానం రావడం చాలా సంతోషంగా ఉంది

తక్కువ టైంలో పూర్తి చేయాలన్నదే నాలక్ష్యం

- రమేష్ చంద్ర, నాగర్ కర్నూల్ జిల్లా.



మాది నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామం. నేను ఎంపీడీ చేస్తున్నాను. ఇప్పటి వరకు ఢిల్లీ, ముంబై, చెన్నై, గుజరాత్, అహ్మదాబాద్‌లో జరిగిన సుమారు 50 హాఫ్ మారథాన్‌లలో, వైజాగ్, కొచ్చి, హైదరాబాద్‌లో జరిగిన 5 మారథాన్‌లలో పాల్గొన్నా. ప్రతి మారథాన్, హాఫ్ మారథాన్‌లో మొదటి, రెండవ స్థానంలో నిలిచాను. గతేడాది సిద్దిపేటలో నిర్వహించిన హాఫ్ మారథాన్‌లో పురుషుల విభాగంలో మొదటి స్థానంలో, ఈ సారి రెండవ స్థానంలో నిలిచాను. ఆగస్టు 25న హైదరాబాద్‌లో జరిగే మారథాన్‌లో పాల్గొనడానికి సన్నద్ధం అవుతున్నాను. అతి తక్కువ టైంలో మారథాన్, హాఫ్ మారథాన్ పూర్తి చేయాలన్నదే నాలక్ష్యం

ఈ సారి కూడా సెకండ్ ప్లేస్‌లో..

- నవ్య, నల్గొండ జిల్లా



మాది నల్గొండ జిల్లా చీకటిగూడెం. డిగ్రీ పూర్తి చేసి ఫిట్‌నెస్ కోచ్ చేస్తున్నాను. 100కు పైగా హాఫ్ మారథాన్, 5 మారథాన్‌లలో పాల్గొన్నాను. అన్నింటిలో దాదాపు మొదటి, రెండవ స్థానంలో నిలిచాను. గత యేడాది ఇక్కడ నిర్వహించిన హాఫ్ మారథాన్‌లో మహిళల విభాగంలో రెండవ స్థానంలో నిలిచాను. మళ్లీ ఈ సారి కూడా రెండవ స్థానంలో నిలిచాను.

సిద్దిపేటలో రెండవసారి పాల్గొన్నా

- సీహెచ్. నాగభూషణం, హైదరాబాద్



నా వయసు 73. మాది హైదరాబాద్‌లోని మల్లాపూర్. హెచ్‌సీఎల్ రిటైర్డ్ ఉద్యోగిని. నేను సిద్దిపేటలో నిర్వహించిన హాఫ్‌మారథాన్‌లో పాల్గొనడం ఇది రెండోసారి. హైదరాబాద్, ముంబై, అమెరికా, చెన్నై, అహ్మదాబాద్, ఢిల్లీ, విశాఖపట్నం, పట్నాలలో 12 మారథాన్‌ల (60 ఏళ్ల పైబడిన వారి కోటా)లో పాల్గొన్నాను. ఏడుసార్లు పోడి యో విన్నర్‌గా నిలిచాను. ఈసారి 61 ఏళ్ల పైబడిన వారి విభాగంలో మొదటి స్థానంలో నిలవడం చాలా సంతోషంగా ఉంది.

రెండు గంటల్లోపే హాఫ్ మారథాన్ పూర్తి చేయాలి

- లక్ష్మీనారాయణ, (అంధుడు), హైదరాబాద్



మాది హైదరాబాద్‌లోని ఈసీఐఎల్. టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. నాకు పుట్టుకతోనే కళ్లు కనిపించవు. స్నేహితుల సహాయంతో పరుగు పోటీల్లో పాల్గొంటాను. ఇప్పటి వరకు 10కిపైగా హాఫ్ మారథాన్, 2 మారథాన్‌లు చెన్నై, ఢిల్లీలో పాల్గొన్నాను. సిద్దిపేటలో పాల్గొనడం ఇది రెండోసారి. ఈసారి 2గంటల33 నిమిషాల్లో హాఫ్ మారథాన్ పూర్తి చేశాను. 2 గంటల్లోపే హాఫ్‌మారథాన్ పూర్తిచేయాలన్నది నా లక్ష్యం.

అసలే టీచర్ల కొరత.. మరో పాఠశాలకు డిప్యూటేషన్

● బదిలీలతో ఖాళీ అవుతున్న ఉపాధ్యాయుల పోస్టులు

అల్లాదుర్గం, జూలై 28 : టీచర్ల కొరత ఉన్న పాఠశాలల నుంచే డిప్యూటేషన్లపై ఉపాధ్యాయులను మరో పాఠశాలకు బదిలీ చేస్తున్నారు. విద్యార్థులున్న పాఠశాలలో అసలే ఉపాధ్యాయుల కొరత ఉందంటే.. అదే పాఠశాల నుంచి మరో ఉపాధ్యాయుడిని ఇతర పాఠశాలకు డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. అల్లాదుర్గం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని అప్పాజీపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఆరుగురు ఉపాధ్యాయులుండగా ఇటీవల జరిగిన టీచర్ల బదిలీలో ముగ్గురు ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. కానీ, ఈ పాఠశాలలో బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానంలో ఇతర ఉపాధ్యాయులను భర్తీ చేయలేదు. దీంతో ఆ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులే ఉన్నారు. ఆ ముగ్గురిలో ఓ ఉపాధ్యాయుడిని చిల్వర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని కోమటికుంట ప్రాథమిక పాఠశాలకు అధికారులు డిప్యూటేషన్‌పై బదిలీ చేయడంతో ఇక ఇద్దరు ఉపాధ్యాయులే దిక్కయ్యారన్నారు. ఈ పాఠశాలలో 61 మంది విద్యార్థులుండగా చిల్వర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని బహిరన్‌దిబ్బ ప్రాథమికోన్నత పాఠశాలలో 23 మంది విద్యార్థులకు ముగ్గురు టీచర్లు ఉన్నారు. బహిరన్‌దిబ్బ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఓ ఉపాధ్యాయుడిని కోమటికుంట పాఠశాలకు డిప్యూటేషన్ వేయకుండా అప్పాజీపల్లి పాఠశాల నుంచి వేయడం ఏమిటంటూ వారు ఉన్నతాధికారులను ప్రశ్నిస్తున్నారు. తక్కువ విద్యార్థులున్న పాఠశాలలోని ఉపాధ్యాయులను వదిలి అధిక సంఖ్యలో విద్యార్థులున్న పాఠశాల నుంచి డిప్యూటేషన్‌పై బదిలీ చేయడం పలు అనుమానాలకు తావిస్తుందని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

సక్సెస్ స్కూల్‌లోను ఖాళీలే...

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యనందిస్తున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వం పాఠశాలలో ఏర్పడిన ఉపాధ్యాయుల కొరత తీర్చడంలో మాత్రం దృష్టి సారించడం లేదన్న విమర్శలు మండలంలో వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ (బాలికల) ఉన్నత పాఠశాలలో ప్రధానమైన సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీ ఏర్పడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో ఏకంగా ఆరు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఏర్పడగా ఇందులో ఇంగ్లిష్, భౌతిక రసాయన శాస్త్రం బోధించే నలుగురు ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తెలుగు, జీవశాస్త్రం బోధించే ఉపాధ్యాయుల పోస్టులు నాలుగు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఇలా మండలంలోని పలు పాఠశాలలో ఇదే దుస్థితి నెలకొన్నది. ఇలాగైతే విద్యాప్రమాణాలు ఎలా మెరుగు పడతాయని ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఖాళీ ఏర్పడిన ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.



అల్లాదుర్గం మండలం అప్పాజీపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాల

రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రీ మృతి



కనకయ్య (ఫైల్)

చిన్నకోడూరు, జూలై 28 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తాపీ మేస్త్రీ మృతిచెందిన సంఘటన మండలంలోని చంద్లాపూర్ శివారులో ఆదివారం సాయంత్రం జరిగింది. స్థానికులు, 108 అంబులెన్స్ సిబ్బంది రాజిరెడ్డి, వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లీపూర్ గ్రామానికి చెందిన గంగాధర కనకయ్య(60) తాపీ మేస్త్రీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం రామంచలోని తన కూతురు ఇంటికి ద్విచక్ర వాహనం (టీవీఎస్ ఎక్సెల్)పై వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో చంద్లాపూర్ గ్రామ శివారులోని పల్లెప్రకృతి వనం సమీపంలోకి రాగానే ద్విచక్రవాహనం అదుపు తప్పి రంగనాయకసాగర్ ప్రాజెక్టు కట్టపైకి ఎక్కే గేటు ద్వారానికి ఢీ కొట్టాడు. దీనితో కనకయ్య తలకు, కాళ్లకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది చికిత్స నిమిత్తం కనకయ్యను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కనకయ్యను పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. కనకయ్యకు భార్య వజ్రవ్వ, కుమారుడు ఉన్నారు.

కుక్కలను ఢీకొన్న ద్విచక్రవాహనదారుడు

● ఒకరికి తీవ్రగాయాలు... తొగుట వద్ద ఘటన



గాయాలను చూపుతున్న రాజు

తొగుట, జూలై 28 : ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తికి ఒక్కసారిగా కుక్కలు అడ్డురావడంతో వాటిని ఢీకొని కిందపడడంతో తీవ్ర గాయాలైన సంఘటన తొగుటలో సాయంత్రం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తొగుట మండలం చందాపూర్ గ్రామానికి చెందిన చందారాజు తొగుట నుంచి గ్రామానికి మోటర్ సైకిల్‌పై వెళ్తుండగా ఒక్కసారి ఊర కుక్కలు రోడ్డుపైకి వచ్చి మోటర్ సైకిల్‌ను ఢీకొట్టాయి. దాంతో మోటర్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న చందారాజు కిందపడి తీవ్రగాయాలయ్యాయి. అతడిని గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం గజ్వేల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతడని పరీక్షించిన వైద్యులు అతడికి కాలు విరిగినట్లు నిర్ధారించారు. ఊర కుక్కల బెడద నుంచి వాహనచోదకులకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

'అవ్వ తాతలకు ఉత్తరం రాద్దాం'

విద్యార్థులతో నిర్వహించనున్న కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం

సిద్దిపేట అర్బన్, జూలై 28 : పిల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీసి వారిలో భాషా రచనల పట్ల ఆసక్తి కలిగించేందుకు నిర్వహించ తలపెట్టిన 'అవ్వ తాతలకు ఉత్తరాలు రాద్దాం రండి' కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల గ్రామంలో ఉపాధ్యాయ బృందం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాయలో పడి నేడు ఉత్తరాలు రాసే వారే కరువయ్యారని, నేటి విద్యార్థులకు ఉత్తరాలు అంటే తెలియడంలేదని అన్నారు. ఉత్తరాలపై అవగాహన కలిగించడానికి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేందర్, నిర్వాహకులు లక్ష్మయ్య, పూర్ణచంద్రరావు, అనిల్ కుమార్, సుహాసిని, శ్రీశైలం, రాజేందర్, రమాదేవి, సునీత, ఆగయ్య, శ్రీనివాస్, సరిత, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ ఏఈవో సస్పెన్షన్

హుండీ లెక్కింపు సంఘటనతోపాటు

గతంలోని అభియోగాలపై చర్యలు



ఏఈవో గంగా శ్రీనివాస్

చేర్యాల, జూలై 28 : కొమురవెల్లి మల్లన్న ఆలయ ఏఈవో గంగా శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటువేశారు. దేవాదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఆలయాధికారులు క్రమశిక్షణా చర్యలు తీసుకుంటూ ఆదివారం సస్పెన్షన్ ఉత్తర్వులు అందజేశారు. మల్లన్న ఆలయంలో గత జాతర సమయంలో ఏఈవో గంగా శ్రీనివాస్ జారీ చేసిన రూ.500 విలువైన వీవీఐపీ పాసులు అమ్ముకుంటూ పలువురు వలంటీర్లు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈవిషయమై ఏఈవో గంగా శ్రీనివాస్‌తో పాటు పలువురు వలంటీర్లపై కొమురవెల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతడిపై కేసు నమోదు చేస్తూ వలంటీర్లను రిమాండ్‌కు పంపించారు. అంతేకాకుండా ఈనెల 16వతేదీన మల్లన్న ఆలయంలో చేపట్టిన హుండీ లెక్కింపుల్లో లభ్యమైన ఓ బంగారు ఉంగరం మాయమవడంతో పాటు బంగారు గొలుసు చెత్తబుట్టలో లభ్యమైంది. ఆ సమయంలో ఏఈవో గంగా శ్రీనివాస్ పర్యవేక్షణ బాధ్యతలో ఉండటంతో అత డిపైనే అనుమానం ఉందని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఈవో బాలాజీశర్మ కొమురవెల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే కొద్దిరోజుల క్రితం ఎలక్ట్రీషియన్ అంజయ్యపై చేయిచేసుకున్న విషయంపైనా గంగా శ్రీనివాస్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయా పరిణామాలతో పాటు గతంలోనూ గంగా శ్రీనివాస్‌పై అవకతవకలు, అవినీతి అభియోగాలు నెలకొనడం, ఇటీవల చోటుచేసుకున్న బంగారు గొలుసు అపహరణ యత్నం సంఘటనలతో దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సస్పెన్షన్ చేశారు. ఇదిలా ఉండగా, ఈవిషయమై ఏఈవో గంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తాను బంగారం గొలుసు చోరీకి పాల్పడినట్లు నిర్ధారణ జరగకుండానే సస్పెన్షన్ చేయడం సరికాదని పేర్కొన్నారు.



మెదక్‌లో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న కాళికాదేవి మాత





సంగారెడ్డి పట్టణం, వట్‌పల్లి మండల కేంద్రంలో బోనాల ఊరేగింపులో శక్తిరూపాల ప్రదర్శన

అమ్మకు బోనం

జోర్దార్‌గా ఊరేగింపులు

- శివసత్తుల శిగాలు
- పోతరాజుల విన్యాసాలు
- హాజరైన ప్రముఖులు

సంగారెడ్డి రూరల్/కంది/కొండాపూర్/వట్‌పల్లి/నారాయణఖేడ్/కోహీర్/కంగ్టి/ మనూరు/రామచంద్రాపురం/జిన్నారం జూలై 28 : ఆషాఢమాసం చివరి ఆదివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బోనాల జాతర హోరెత్తింది. గ్రామాలు, పట్టణాల్లో బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. శివసత్తుల శిగాలు, పోతురాజుల వీరంగంతో మార్మోగింది. సంగారెడ్డిలో ముదిరాజ్, గంగపుత్ర, కుమ్మరి సంఘాల ఆధ్వర్యంలో బోనాలను నిర్వమించారు. పట్టణం శివారులోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి ప్రధాన రహదారి మీదుగా పాత బస్టాండ్ వద్ద గల దుర్గమ్మ ఆలయం వరకు ముదిరాజ్ కులస్థులు మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. బోనాల మహోత్సవంలో జోగిని నవ్యశ్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఊరేగింపులో శక్తిరూపాల ప్రదర్శన ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు, నీలం మధు పలువురు పాల్గొన్నారు. కంది మండలంలోని అన్ని గ్రామాల్లో బోనాల ఉత్సవాలు కొనసాగాయి. డప్పుచప్పుళ్లు, డీజే సౌండ్ల పాటల మధ్య బోనాలను ఊరేగించారు. ఈ ఉత్సవాల్లో గొర్రెపొట్టేళ్లతో ప్రత్యేకంగా తయారు చేసిన ఫలహారం బండ్లు ఆకర్షించాయి. కొండాపూర్ మండలం తొగర్‌పల్లిలో దుర్గమ్మ జాతరోత్సవాలు ఘనంగా జరిగాయి. గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి రంగాలు నిర్వహించారు. వట్‌పల్లి మండలం గొర్రెకల్‌లో రేణుకా ఎల్లమ్మ దేవతకు నిర్వహించిన బోనాల వేడుకలలో అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, వరం కమిటి మాజీ అధ్యక్షులు వీరారెడ్డి హజరై భక్తులతో కలసి బోనాలతో ఆలయానికి తరలివెళ్లారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వివధ వేషాధారణలో నృత్యాలు అలంరించాయి. నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలోని ఆరేల్లి మైసమ్మ ఆలయానికి అట్టహాసంగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. మంగల్‌పేట దుర్గా మాత ఆలయంలో అమ్మవారు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. ఖేడ్ పట్టణంలోని మహంకాళి ఆలయం, పోచమ్మల ఆలయాల ఆవరణలో కన్నులపండుగగా బోనాల ఊరేగింపు కొనసాగింది. శాస్త్రీనగర్ గడి మైసమ్మ ఆలయం ఆవరణలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, తదితరులు పాల్గొన్నారు. కోహీర్ మండల పరిధిలోని బిలాల్‌పూర్, వెంకటాపూర్, మనియార్ పల్లి తదితర గ్రామాల్లో గ్రామ దేవతలకు ఘనంగా బోనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కంగ్టి మండల పరిధిలోని దెగుల్‌వాడి, ఎన్కెమూరి తదితర గ్రామాల్లో బోనాల జాతర నిర్వహించారు. మనూరు మండలం దోసపల్లి లో నిర్వహించిన బోనాల వేడుకలో ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్ నగర సమీపంలోని రామచంద్రాపురం, తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్ తదితర ప్రాంతంలో అంగరంగ వైభవంగా బోనాలు కొనసాగాయి. ఉస్మాన్‌నగర్‌లో జరిగిన పోచమ్మ బోనాలను వంశపార్యంగా వస్తున్న తలారి శ్రీలతవిష్ణు ముదిరాజ్ కుటుంబం నుంచి తలారి శంకర్ ఊరు బోనం అమ్మవారికి నివేదించారు. అనంతరం గౌడ కులస్థుల నుంచి నర్సింహ కల్లుఘటాన్ని సమర్పించారు. తెల్లాపూర్‌లో కౌన్సిలర్లు కమ్మెట జ్యోతిశ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో అమ్మవారికి బోనాలు సమర్పించారు. రామచంద్రాపురంలో పలు కాలనీలో జరిగిన బోనాల ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్సీ వి.భూపాల్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ 111, 112 డివిజన్ల కార్పొరేటర్లు సింధూ ఆదర్శరెడ్డి, పుష్పనగేష్, జాతీయ యూనియన్ నాయకులు టీవీ రావు తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొల్లారం మున్సిపాలిటీ సహా అన్ని గ్రామాలలో బోనాల ఊరేగింపులు, దేవాలయాల వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



వట్‌పల్లి మండలం గొర్రెకల్‌లో బోనంతో మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్



సంగారెడ్డిలో బోనంతో మహిళలు

మెదక్‌లో నల్లపోచమ్మకు కలెక్టర్ పూజలు

మెదక్‌అర్బన్/తూప్రాన్/మనోహరాబాద్/రామాయంపేట/పెద్దశంకరంపేట/ శివ్వంపేట/కొల్చారం/అల్లాదుర్గం/హుస్నాబాద్‌రూరల్/వర్గల్, జూలై 28: పట్టణ విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో మహాకాళీమాతకు ఘనంగా బోనాలను నివేదించారు. గాంధీనగర్, డబుల్‌బెడ్‌రూం కాలనీలో వైభవంగా నిర్వహించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ దంపతులు స్థానిక తారకరాంనగర్‌లోని నల్లపోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సమేతంగా బోనం ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. ఈ ఉత్సవాల్లో ఏఎంసీ చైర్మన్ బట్టి జగపతి, టుబీహెచ్‌కే కమిటీ సభ్యులు ప్రభు, చారి, శ్రీనివాస్, నర్సింలు, విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పూన రవీందర్ తదితరులు పాల్గొన్నారు. తూప్రాన్ పట్టణంలో ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్, సిద్దిపేట జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్, మనోహరాబాద్, ధర్మారాజుపల్లి, గ్రామాలలో బోనాలు కొనసాగాయి. కాళ్లకల్‌లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. రామాయంపేట పట్టణంలో మహంకాళి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ తల్లి వాణి, బీఆర్‌ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంటారెడ్డి తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ తదితరులు మాతను దర్శించుకున్నారు. పెద్దశంకరంపేటలోని భవానీమాత అమ్మవారికి అంగరంగ వైభవంగా బోనాలు సమర్పించారు. శివ్వంపేటతో మండలంలోని దొంతి, గోమారం, తదితర గ్రామాల్లో బోనాల ఊరేగింపులు కొనసాగాయి. గోమారం, శివ్వంపేటలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కాంగ్రెస్ నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొల్చారంలో బొడ్రాయి, కోటమ్మ, రేణుక ఎల్లమ్మ, పోచమ్మ, దుర్గమ్మ అమ్మవార్లకు గ్రామస్థులు బోనం సమర్పించారు. అల్లాదుర్గంలో కట్టమైసమ్మ దేవతకు భక్తులు బోనాలను సమర్పించారు. హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి, కూచనపల్లిలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో బోనాలు నిర్వహించారు. వర్గల్ గ్రామంలోని దుర్గమ్మ, పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, కనకదుర్గమ్మ ఆలయాలకు మహిళలు డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాల నడుమ బోనాలతో ఊరేగింపుగా వెళ్లి బోనాలు సమర్పించారు.



మెదక్‌లో బోనాల ఊరేగింపులో మహిళలు



పెద్దశంకరంపేటలో బోనాలు తీసుకెళుతున్న మహిళలు



హుస్నాబాద్ మండలం పొట్లపల్లిలో



జిన్నారంలో శిగాలూగుతున్న మహిళలు



కొల్చారంలో బోనాల ఊరేగింపు



తూప్రాన్‌లో బోనంతో వంటేరు ప్రతాప్‌రెడ్డి





తూప్రాన్‌లో డప్పుచప్పుళ్లు, శివసత్తుల శిగాల మధ్య మహంకాళి ఆలయానికి తీసుకొస్తున్న బోనాలు, మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు సన్మానం



మనూరు మండలం దోసపల్లిలో పోతురాజుల వీరంగం



వర్గల్‌లో బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు



నారాయణఖేడ్ పరిధిలో మైసమ్మకు బోనాల ఊరేగింపు



కంది మండలం బ్యాతోల్‌లో బోనాల ఉత్సవం



కోహీర్ మండలం వెంకటాపూర్ గ్రామంలో



సంగారెడ్డిలో బోనాల ఊరేగింపు నీలం మధు



సంగారెడ్డిలో పలారం బండి ఊరేగింపులో పులిమామిడి రాజు

చదువుతో పేదరికాన్ని ముడి పెట్టవద్దు

- సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్

తొగుట/మిరుదొడ్డి, జూలై 28: చదువుకు పేదరికాన్ని ముడిపెట్టవద్దని, చదువు ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగునింపుతుందని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని గోవర్ధనగిరి గ్రామ పంచాయితీ పరిధిలోని ముత్యంపేట పిట్టలవాడ గ్రామంలో ఆదివారం సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. చెడు వ్యసనాలను విడనాడితేనే పేదరికం నుంచి గట్టెక్కుతారన్నారు. అంతకు ముందు గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరంలో ఆరు విభాగాల వైద్యులు పాల్గొని ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరుగురు విద్యార్థులకు ఆయన ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమరసత వేదిక ప్రతినిధులు రాజశేఖర్‌రెడ్డి, యాదగిరి, సంతోష్, రుక్మిణీ, వైద్యులు అరవింద్, విజయ్‌భాస్కర్, సాయి, శిరీష, అరుణ్‌కుమార్‌రెడ్డి, సందీప్, సాయినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మిరుదొడ్డి మండలంలోని అందే గ్రామంలో ఆదివారం సామాజిక సామరసత వేదిక, గ్రామీణ చేతన వికాస సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని గ్రంథాలయాన్ని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ ప్రారంభించారు. ఉచిత వైద్యశిబిరంలో సుమారు ఆరువందల మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ నరేష్‌బాబు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



తొగుట మండలం పిట్టలవాడలో సైకిళ్లను పంపిణీ చేస్తున్న అప్పాల ప్రసాద్

అర్ధరాత్రి తలుపులు పగులగొట్టి వృద్ధురాలి నగలు అపహరణ

రాయపోల్, జూలై 28: ఇంట్లో వృద్ధురాలు ఒంటరిగా ఉన్నట్లు గమనించిన దుండగులు అర్ధరాత్రి తలుపులు పగులగొట్టి ఆమె ఒంటిపై ఉన్న నగలు లాక్కొని వెళ్లిన సంఘటన రాయపోల్‌లో చోటుచేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ రఘుపతి కథనం ప్రకారం.. రాయపోల్‌కు చెందిన నర్సవ్వ(70)కు భర్త చనిపోగా, పిల్లలు లేకపోవడంతో మేనకోడలు కోల సత్తవ్వను దత్తత తీసుకుంది. సత్తవ్వ కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 26న శుభకార్యం నిమిత్తం బెజుగామకు వెళ్లింది. ఈ క్రమంలో శనివారం రాత్రి నర్సవ్వ అన్నం తిని గడియ పెట్టుకొని పడుకున్నది. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు ఆమె ఇంటి విద్యుత్ నిలిపివేసి తలుపులు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి నర్సవ్వ చెవిపై ఉన్న 15 గ్రాముల బంగారు గంటీలు, మెడలో ఉన్న 20 గ్రాముల బంగారు గుండ్లు, 200 గ్రాముల వెండి కాళ్ల పట్ట గొలుసులు లాక్కొని పరారయ్యారు. గంటీలు లాగడం వల్ల ఆమె చెవులకు గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితురాలి మేనకోడలు సత్తవ్వ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భూ కేటాయింపులు సరే.. పరిశ్రమలు ఎక్కడా?

- టీజీఐఐసీ ద్వారా పరిశ్రమల కోసం భూసేకరణ
- ఉత్పాదన, ఉపాధి రంగాల కోసం విలువైన స్థలాల అందజేత
- ఏళ్లు గడుస్తున్నా కనిపించని పరిశ్రమల జాడ
- భూములు కొల్లగొడుతున్నారని ఆరోపణలు

జిన్నారం, జూలై 28 : రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు కల్పించాలని గత ప్రభుత్వం తీసుకువచ్చిన టీఎస్‌ఐపాస్‌తో భూములు దక్కించుకున్న సంస్థలు ఏళ్లు గడుస్తున్నా ఉత్పాదన కేంద్రాల ఏర్పాటు చేపట్టకపోవటంతో లక్ష్యం నెరవేరటం లేదు. ఉపాధి కోసం నిరీక్షిస్తున్న నిరుద్యోగుల్లో తీవ్ర నిరాశ నెలకొన్నది. మరోవైపు విలువైన భూములు కాజేసేందుకు పరిశ్రమల స్థాపన పేరుతో కొందరు స్థలాలు దక్కించుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసైన్డ్ భూముల సేకరణతో జీవణోపాధి కోల్పోతున్నామని రైతులు ఆందోళనలు చేపట్టి కోర్టులను ఆశ్రయిస్తున్నారు. దీంతో పరిశ్రమల కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో ఏళ్లు గడుస్తున్నా నిర్మాణాలు చేపట్టకపోవటంతో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కోసం నిరీక్షిస్తున్న మండల వాసులకు అసలు పరిశ్రమల స్థాపన జరిగేనా అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇప్పటికే స్థలాలు కేటాయించిన గ్రామాల్లో ఆయా సంస్థలు ప్రహరీలు, ఫెన్సింగ్‌ల ఏర్పాటుతో చేతులు దులుపుకున్నాయి తప్ప అసలు ఉత్పత్తి చేసే ప్లాంట్ల నిర్మాణాలు ఏర్పాటు చేయడంలేదు.

స్థలాల చుట్టూ ప్రహరీలు

నగర శివారు ప్రాంతమైన జిన్నారం మండలంలో భూములకు భారీగా విలువ ఉన్నది. ఈ నేపథ్యంలో ఇక్కడ పరిశ్రమల స్థాపన కోసం కొందరు టీఎస్ (ప్రస్తుతం టీజీ) ఐఐసీ ద్వారా దరఖాస్తులు చేసుకున్నారు. ఉపాధి రంగాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం స్థలాలు అందుబాటులో ఉంటే 15 రోజుల్లోనే అన్ని రకాల అనుమతులను మంజూరు చేసింది. ఈ పథకం కింద మండలంలోని శివానగర్‌లో 114 సర్వే నంబర్‌లో 118 ఎకరాల అసైన్డ్ స్థలాన్ని సేకరించి ఎల్‌ఈడీ బల్బుల పరిశ్రమల కోసం కేటాయించారు. ఇక్కడ ఏడేళ్లలో రోడ్లు, కాలువలు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించినా ఇప్పటి వరకు 30 ఎకరాల్లో 10కి మించి చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు జరిగింది. మరో 60 శాతం స్థలం ఖాళీగానే ఉన్నది. ఇక గడ్డపోతారం పరిధిలోని అల్లీనగర్ 27 సర్వే నంబర్‌లోనూ భూకేటాయింపులు జరుపగా అక్కడ పలు చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేశారు. ఇంకా కేటాయించిన స్థలంలో పూర్తిగా పరిశ్రమల నిర్మాణం చేపట్టలేదు. ఇటీవల కోర్టు నుంచి అనుమతులు పొందిన రెండు మూడు చిన్న తరహా పరిశ్రమలు స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాయి. ఇంకా 10 ఎకరాల్లో పరిశ్రమల నిర్మాణం జరగాల్సి ఉన్నది. అదే విధంగా మంగంపేటలో సర్వే నంబర్ 55లో మూడేళ్ల క్రితం 22 ఎకరాల ప్రభుత్వ భూమి సేకరించిన టీఎస్‌ఐఐసీ అధికారులు ఓ హెలీకాప్టర్ విడి భాగాల తయారీ సంస్థకు భూమిని కేటాయించారు. ఇంతవరకు ఇక్కడ ఎలాంటి పనులు చేపట్టలేదు. సెక్యూరిటీని నియమించి స్థల రక్షణ ఏర్పాటు చేసుకున్నారు. కాగా జిన్నారం సర్వే నంబర్ 1లో 36 ఎకరాలను ఏడాదిన్నర క్రితం ఓ సంస్థకు కేటాయించారు. ఇటీవల స్థలం పొందిన సంస్థ 35 ఎకరాల చుట్టూ ప్రహరీ నిర్మాణం ప్రారంభించగా ఉత్పాదన జరిగే పరిశ్రమ ఏర్పాటు పనులు మాత్రం చేపట్టలేదు. ఇక స్థలాలు పొందిన వారు ఏళ్లు గడుస్తున్న పలు కారణాలతో పరిశ్రమల ఏర్పాటులో జాప్యం చేస్తున్నాయి. కొత్తగా వావిలాల 189 సర్వే నంబర్‌లోనూ పరిశ్రమల కోసం అసైన్డ్ భూముల కేటాయింపులకు రంగం సిద్ధం కావటం గమనార్హం.



మంగంపేట వద్ద ఓ పరిశ్రమ కోసం కేటాయించిన స్థలం చుట్టూ రేకులతో ఏర్పాటు చేసుకున్న ప్రహరీ

పరిశ్రమల పేరిట విలువైన భూముల ధారాదత్తం

పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించాలనే ప్రభుత్వ లక్ష్యం కొందరికి కల్పతరువుగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త పరిశ్రమల కోసం అసైన్డ్, ప్రభుత్వ భూములను కారు చౌకగా దక్కించుకుని ఏళ్లు గడుస్తున్నా ఉత్పాదనలు చేపట్టని తీరుపై సందేహాలు నెలకొన్నాయి. మండలంలో ఎకరం రూ.2 నుంచి 4 కోట్ల వరకు ఉన్న ప్రాంతంలో పరిశ్రమలకు 30 నుంచి 55 లక్షలకే ఎకరం కేటాయించారు. కాగా పరిశ్రమ ఏర్పాటుకు 5 ఎకరాలు అవసరం ఉంటే 20 నుంచి 30 ఎకరాల వరకు కేటాయింపులు జరుపటం గమనార్హం. ఇప్పటికే కొన్ని చోట్ల మూతపడ్డ పరిశ్రమలు ఆయా స్థలాలను విక్రయించటం లీజుకు ఇస్తుండగా.. కొత్త పరిశ్రమల కోసం ఎడాపెడా విలువైన భూముల కేటాయింపులు చేపట్టడంపై విమర్శలు ఉన్నాయి. కాగా టీజీఐఐసీ భూ కేటాయింపులలో దళారులు కూడా ఉన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. భూకేటాయింపుల నుంచి అనుమతుల వరకు ఈ వ్యవహారంలో కొందరు చక్రం తిప్పుతున్నారని ప్రచారం జరుగుతుంది. కొత్త ప్రభుత్వం మండలంలో పరిశ్రమల కోసం కేటాయించిన స్థలాలపై సమీక్ష జరిపి కాలపరిమితి పాటించని పరిశ్రమల భూకేటాయింపులు రద్దు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ



పట్నంవేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

చేర్యాల, జూలై 28: కొమరవెల్లి మల్లికార్జునస్వామిని దర్శించుకోవడానికి ఆదివారం భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. సంప్రదాయబద్ధంగా మట్టికుండలో బోనంచేసి భక్తిప్రపత్తులతో చలక, నజరు, ముఖమండప పట్నాలువేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడి బియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లంపానకం సాక పెట్టి ఒడి బియ్యాలు పోశారు. స్వామివారి దర్శనానికి గంటన్నర సమయం పట్టింది.

'పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి'

చేర్యాల, జూలై 28: కొమురవెల్లి మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షురాలు అత్తిని ఆరిక కోరారు. కస్తూర్బా పాఠశాలను ఆదివారం సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రహరీ లేకపోవడంతో విద్యార్థినులకు రక్షణ కరువై ఇబ్బందులుపడుతున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి వెంటనే ప్రహరీ నిర్మించాలని కోరారు.

చేర్యాల ప్రభుత్వాసుపత్రిలో ప్రసూతి కష్టాలు

- ఇటీవల గైనకాలజీ డాక్టర్ స్రవంతి బదిలీ
- ఇబ్బందులు పడుతున్న గర్భిణీలు

చేర్యాల, జూలై 28: చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళిమిట్టతో పాటు జనగామ జిల్లాలోని బచ్చన్నపేట, నర్మెట్ట మండలాలకు ఏకైక దిక్కుగా ఉన్న చేర్యాల ప్రభుత్వాస్పత్రిలో మళ్లీ ప్రసూతి కష్టాలు మొదలయ్యాయి. ఆమరణ దీక్షల చేయడంతో అధునాతన వసతులు, అనువైన భవనం సమకూరినప్పటికీ ప్రత్యేక వైద్యనిపుణులు లేకపోవడంతో నామమాత్రంగా మారింది. గతంలో నిత్యం ఓపీ 200-500వరకు ఉండేది. అది ప్రస్తుతం100-150కి చేరింది

గైనిక్ డాక్టర్ బదిలీతో ఇబ్బందులు

ఎన్నో ఏళ్ల క్రితం ప్రసూతి ఆపరేషన్లు నిలిచిపోవడంతో ఆరేళ్లక్రితం అప్పటి మంత్రి హరీశ్‌రావు చొరవతో ఇద్దరు గైనకాలజీ డాక్టర్లను నియమించారు. కానీ ఇరువురిలో స్రవంతి మాత్రమే ఇక్కడ విధులు నిర్వహించి ప్రసూతి ఆపరేషన్లు కొనసాగించారు. లాంగ్‌స్టాండింగ్ పేరిట ఇటీవల ఆమెను బదిలీ చేశారు. ఆమె స్థానంలో ఇంకెవర్నీ నియమించకపోవడంతో ప్రసూతి కష్టాలు మళ్లీ మొదటికి వచ్చాయి. ఇన్నాళ్లు రెగ్యులర్ అనస్థీషియాన్ లేనికారణంగా వారంరోజులకు ఓమారు ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు.

వంతులవారీగా విధులు

గైనిక్ డాక్టర్ బదిలీ అయిన నేపథ్యంలో ఆస్పత్రిలో



ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న ప్రసూతి వార్డు

ఒక రెగ్యులర్, మరో ఇద్దరు కాంట్రాక్టు వైద్యులన్నారు. అందరూ నిత్యం ఓపీ చూడాల్సి ఉన్నప్పటికీ ఒకే డాక్టర్ వైద్యపరీక్షలు చేస్తున్నారు. వంతులవారీ విధులు నిర్వహిస్తూ సమయపాలన కూడా సక్రమంగా పాటించకపోవడంతో ప్రజలు గంటల తరబడి ఎదురుచూస్తున్నారు. చిన్నపిల్లల వైద్యురాలున్నా గైనిక్ డాక్టర్ లేకపోవడంతో గర్భిణీ, బాలింతలకు సేవలందడం లేదు.

ఎవరికి వారే యమునాతీరే

పీపీపీ యూనిట్ ఉన్నప్పటికీ ఎవరి పర్యవేక్షణా లేకపోవడంతో వైద్యులు, సిబ్బంది ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. ఎవరు ఏం పనిచేస్తున్నారో. ఎప్పుడు వచ్చి ఎప్పుడు వెళతారో కూడా తెలియని దుస్థితి. జవాబుదారీతనం కొరవడింది. జిల్లా వైద్యశాఖాధికారులు తరచూ మద్దూరు పీహెచ్‌సీ పరిశీలిస్తున్నారే తప్ప ఏనాడూ సక్రమంగా పీపీపీ యూనిట్‌ని పర్యవేక్షించకపోవడం పట్ల అనుమానాలు తలెత్తుతున్నాయి.

50పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి

చేర్యాల 30 పడకల ఆస్పత్రిని 50పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయించాలని కోరుతూ ఆదివారం చేర్యాల మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, మార్కెట్ కమిటీ మాజీవైస్ చైర్మన్ కాటం మల్లేశంలు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఆస్పత్రిలో చాన్నాళ్లుగా పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడం లేదని, చాన్నాళ్లుగా పనిచేసిన గైనకాలజీ డాక్టర్ స్రవంతిని ఇటీవల బదిలీ చేయడంతో ప్రజలు సిద్దిపేట తదితర ప్రాంతాలకు వెళుతూ ఇబ్బందులుపడుతున్నారని తెలిపారు. గైనకాలజీ డాక్టర్‌ను వెంటనే నియమించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వీరి



ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న మాజీ జడ్పీటీసీ నర్సింగరావు

వెంట నాయకులు కొక్కొండ రవీందర్, గదరాజు సురేందర్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలి

- ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ



మొక్కలను మేళ తాళాలు, మంగళవాయిద్యాలతో తీసుకొస్తున్న అర్చకులు, ఆలయ ఈవో అన్నపూర్ణ

వర్గల్, జులై 28: మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షిస్తూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం కార్యనిర్వహణాధికారి ఎస్ అన్నపూర్ణ పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవంలో భాగంగా నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వివిధ రకాల మొక్కలను ఆలయం నుంచి ఈరాబాయమ్మ తోట వరకు మేళ తాళలు, మంగళ వాయిద్యాలతో ఆలయ అధికారులు, అర్చకులు తీసుకవచ్చి ఈరాబాయమ్మ తోటలో నాటారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు సుధాకర్, నరేందర్, పాండుతో పాటు ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డును బాగు చేయాలని గ్రామస్థుల నిరసన



నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

చిన్నకోడూరు, జూలై 28: మండల కేంద్రంలోని స్థానిక వివేకానంద విగ్రహం సమీపం నుంచి ఇల్లంతకుంటకు వెళ్లే మార్గంలో సుమారు 1 కిలో మీటరు మేర రోడ్డును బాగు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గ్రామస్థులు, వాహనదారులు నిరసన తెలిపారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పాత బీటీ రోడ్డును తొలగించి మట్టి పోసి వదిలేయడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై గుంతలు ఏర్పడి బురదమయంగా మారిందన్నారు. దీంతో ఆ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కారించాలని కోరారు.

చలో ఢిల్లీ కరపత్రాన్ని ఆవిష్కరించిన నాయకులు

నంగునూరు, జూలై 28: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 6న చేపట్టనున్న చలో ఢిల్లీ కరపత్రాన్ని ఆదివారం టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి దేవులపల్లి రాజేందర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వర్గీకరణ చేస్తానని, మాదిగలకు పెద్దన్న పాత్ర వహిస్తానన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన మాట తప్పారని ఆరోపించారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి మాదిగలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ సాధన కోసం తలపెట్టిన జంతర్ మంతర్ మహాదీక్షను విజయవంతం చేయాలని, మాదిగలు అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాజేందర్, గడ్డం వెంకటేశ్, దేవులపల్లి రాజు, కృష్ణ, సీనియర్ నాయకులు దేవులపల్లి కనకయ్య, సుంచు తిరుపతి. బెజ్జంకి సంజీవ్, విజయ్, చిలుక శోభన్, దేవులపల్లి కరుణాకర్, దేవులపల్లి సాయిలు, తిరుమణి, బాల్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

28: గజ్వేల్ మండలం గిరిపల్లి గ్రామానికి చెందిన ఆటో మెకానిక్ ఎన్కమోళ్ల స్వామి చిన్న కుమారుడు ప్రణీత్(8) బహుళ అవయవ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న తలకొక్కుల చంద్రకళ ట్రస్ట్ చైర్మన్ టి.లక్ష్మణ్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామంలోని ఆయన ఇంటికి వెళ్లి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి, వారి కుటుంబానికి అండగా నిలబడతామన్నారు. ఆయనవెంట ట్రస్ట్ క్యాషియర్ తలకొక్కుల దుర్గాప్రసాద్, తమ్మలి సతీష్, ప్రణీత్ తదితరులున్నారు.

చిన్ననాటి మిత్రుడికి..

దూళిమిట్ట,జూలై 28: మండలంలోని బైరాన్‌పల్లిలో కొన్ని రోజుల క్రితం అప్పిసు బాలమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. అప్పీసు బాలమ్మ కుమారుడికి తనతో చదువుకున్న పదోతరగతి స్నేహితులు రూ.11 వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు.

మృతురాలి కుటుంబానికి..

మర్కుక్, జూలై 28: మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన దుబ్బాసి అరుణ(45) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మర్కుక్ తాజా మాజీ ఎంపీపీ పాండుగౌడ్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించిన వారిలో కర్రోల్ల నర్సింహులు, రవి, బాలయ్య, పోచయ్య, మహేష్, రఘుపతి, బాలకృష్ణ, కిష్టయ్య నరేష్, మల్లయ్య తదితరులు ఉన్నారు. ఇప్పలగూడెం గ్రామానికి చెందిన బ్యాగరి ఎల్లమ్మ అనారోగ్యంతో చనిపోయిన విషయం తెలుసుకుని బాధిత కుటుంబానికి స్థానిక న్యాయవాది పులికంటి భాస్కర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.3000 రూపాయల ఆర్థిక సాయం అందించారు.

అనారోగ్యంతో రేషన్ డీలరు మృతి

మద్దూరు, జూలై 28: మద్దూరు మండలంలోని ఉప్పరోనిగడ్డ గ్రామానికి చెందిన డీలరు జయరాం (65) అనారోగ్యంతో ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. వంగపల్లి, ఉప్పరోనిగడ్డ గ్రామాల ప్రజలకు ప్రజా పంపిణీ ద్వారా సేవలందించాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. డీలరు జయరాం మృతి పట్ల మద్దూరు రేషన్ డీలర్ల సంఘం సంతాపం తెలిపింది. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులున్నారు.

బీజేపీ మండల కార్యవర్గ సమావేశం



కార్యవర్గ సమావేశంలో బీజేపీ నాయకులు

కుకునూరుపల్లి, జూలై 28: కుకునూరుపల్లి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు అనుముల సంపత్‌రెడ్డి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షుడు తిరుమలరావు, కుదిక్యాల రాములు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై తీర్మానం చేశారు. లకుడారం వద్ద అండర్ గ్రౌండ్ కెనాల్ ఏర్పాటు చేసి చుట్టుపక్కల ఉన్న చెరువులకు నీరు అందేలా చర్యలు చేపట్టాలని, కాలువ నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, కుకునూరుపల్లి నుంచి బొప్పాయిపల్లి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని వారు ఈ సందర్భంగా తీర్మానం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేయాలని, అత్యధిక సీట్లు బీజేపీ గెలిచే విధంగా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో దాసరి స్వామి, సదానందగౌడ్, గణేష్, అనిల్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే అర్హత ఎంపీ రఘునందన్‌రావుకు లేదు'

ములుగు, జూలై 28: సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే అర్హత మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు లేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, అన్నసాగర్ మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి విమర్శించారు. వంటిమామిడిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పార్లమెంట్ సమావేశంలో మెదక్ అభివృద్ధికి నిధులు తీసుకురావడం చేతగాని దద్దమ్మవు నీకు సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే అర్హత లేదన్నారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తే బీజేపీ నాయకులకు తగిన గుణపాటం చెప్తామన్నారు. సమావేశంలో శంకర్‌రెడ్డి, నీలం ప్రభాకర్‌రెడ్డి, శశికాంత్‌రెడ్డి, యాదగిరి, బాల్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యాధరి, వేణుగోపాలస్వామి ఆలయాల వద్ద పోలీసుల నిఘా



విద్యాధరి క్షేత్రం వద్ద గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు

వర్గల్, జూలై 28: ఆలయాల వద్ద చోరీలు జరుగుతున్న నేపథ్యంలో వర్గల్ మండల కేంద్రంలోని శ్రీవిద్యాధరి క్షేత్రం, శ్రీవేణుగోపాలస్వామి ఆలయం వద్ద గౌరారం ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో పోలీసుల నిఘా పెట్టారు. ఉదయం, మధ్యాహ్నంతో పాటు రాత్రి వేళ్లలో రెండు మూడు సార్లు గస్తీ నిర్వహిస్తున్నారు. ఆలయ పరిసరాలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆలయాల వద్ద ఎవరైన అనుమానస్పదంగా తిరిగినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని తఎస్ఐ తెలిపారు.

పద్మశాలి సంఘం అధ్యక్షుడికి సన్మానం



రాజారాంను సన్మానిస్తున్న తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, జూలై 28: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా నియమితులైన దేవులపల్లి రాజారాంను గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి సన్మానించారు. గజ్వేల్ మండలం రిమ్మనగూడలోని ఫాంహౌజ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయనవెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, నాయకులు గాడిపల్లి శ్రీనివాస్, గాడిపల్లి బలరాం, సబ్బని నరేశ్, నంగునూరి సత్యనారాయణ, ఎడెల్లి శ్రీనివాస్, ఇక్బాల్, రాజేశం తదితరులున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించండి

- బీజేపీ నాయకులు

కోహెడ, జూలై 28: రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించడంతోపాటు కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలియజేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మైపాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. కోహెడలో బీజేపీ కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని వారు సూచించారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని వారు దుయ్యబట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ స్థానాలను బీజేపీ కైవాసం చేసుకునేలా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. మండల పార్టీ కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రతినెలా చివరి వారంలో



మనకి బాత్ కార్యక్రమాన్ని వింటున్న నాయకులు

ప్రసాగించే మనకి బాత్ ప్రోగ్రాం ల్యాప్ టాప్ ద్వారా లైవ్‌లో పార్టీ శ్రేణులు అందరూ వీక్షించారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శులు పిల్లి నర్సయ్య, జాలిగా రమేష్, కర్ణకంటి నరేష్, పార్టీ శ్రేణులు కక్కర్ల దామోదర్, దావా శేఖర్, సత్యనారాయణరెడ్డి, గుగ్గిళ్ల శ్రీనివాస్, రజినీకాంత్‌రెడ్డి, మ్యాకాల సురేందర్‌రెడ్డి, బండ జగన్‌యాదవ్, చేను తిరుపతి, పొన్నాల శంకర్, కొండబత్తిని సతీష్ శివకుమార్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, రాజేందర్‌రెడ్డి, పెర్యాల సాగర్‌రావు, గిరిధర్, వేముల రమేష్, లక్ష్మయ్య, మామిడి కరుణాకర్, నరాల శ్రీకాంత్, పవన్‌రెడ్డి, బండ సుమన్‌యాదవ్, సంజీవ్, రాజు, సంజీవరెడ్డి ఉన్నారు.

ఏసీరెడ్డి నర్సింహారెడ్డి వర్ధంతి

చేర్యాల, జూలై 28: రైతాంగ సాయుధ పోరాట యోధుడు, జనగామ మాజీ ఎమ్మెల్యే ఏసీరెడ్డి నర్సింహ్మారెడ్డి 33వ వర్ధంతిని ఆదివారం కొమురవెల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి తదితరులు ఎసిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బద్దిపడిగ కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్, సాయిలు, బక్కెల్లి బాలకిషన్, బాలరాజు, ఆరుట్ల రవీందర్ పాల్గొన్నారు. చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సీపీఎం నాయకులు ఎసీరెడ్డి వర్ధంతిని జరిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో, బండకింది అరుణ్‌కుమార్, పోలోజు శ్రీహరి, బోయిని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

- సిద్దిపేట అర్బన్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు కమ్యూనిస్టు నేత ఏసీరెడ్డి నరసింహారెడ్డి 33వ వర్ధంతిని సిద్దిపేటలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాలస్వామి, నాయకులు శశిధర్, రవికు



సిద్దిపేట అర్బన్: నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మార్, ప్రశాంత్, సంజీవ్, బాలమణి, రవీందర్, ఆంజనేయులు, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

- మద్దూరు: మద్దూరు మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే ఏసిరెడ్డి నర్సింహారెడ్డి 33వ వర్ధంతిని సీపీఎం మండల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి, కమిటీ సభ్యులు షఫీ, సాయిలు, యాదగిరి, యాదయ్య, మురళి, ఎంపీడీ సిరాజ్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ నిరుపేదలకు వరం

- ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి

గజ్వేల్, జూలై 28: సీఎం రిలీఫ్‌ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి పేర్కొన్నారు. వర్గల్ మండలంలోని దండుపల్లికి చెందిన ఓ బాధితుడికి రూ.27వేల



బాధితుడికి చెక్కును అందజేస్తున్న యాదవరెడ్డి

చెక్కును ఆదివారం తన నివాసంలో ఎమ్మెల్సీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్‌ఫండ్ నిరుపేదలకు వరమని, ఆపత్కాలంలో ఆస్పత్రిలో పెట్టిన ఖర్చులు సీఎంఆర్ఎఫ్ రూపంలో బాధితులకు అందుతున్నాయన్నారు. ఆయనవెంట బీఆర్ఎస్ నాయకులు రణం శ్రీనివాస్ ఉన్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

కొండపాక, జూలై 28: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, ఈ నెల 30న నిర్వహించబోయే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బర్మ కొమురయ్య, కొండపాక మండల అధ్యక్షుడు పల్లె శ్రీనివాస్ కోరారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ వారు చేశారు. గ్రామ అభివృద్ధిలో, పారిశుధ్య పనుల్లో రోజంతా పనిచేస్తున్న కార్మికులకు కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి జనాభా ప్రాతిపదికన కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ దూళిమిట్ట మండల కమిటీ నియామకం

దూళిమిట్ట, జూలై 28: డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ దూళిమిట్ట మండల కమిటీని ఆదివారం మండల అధ్యక్షుడు కోల సాయిలుగౌడ్ ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా నాగిళ్ల బుచ్చిరెడ్డి, బూర గంగాదర్, మంద శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గద్దల మహేందర్, కార్యదర్శులుగా చల్ల మాధవరెడ్డి, కత్తెర నర్సింహచారి, కోశాధికారిగా లకావత్ కిషన్‌నాయక్, కార్యవర్గ సభ్యులుగా కనకరాములు, జాటోత్ ఫుల్‌సింగ్, పేరం కనకయ్య మహమ్మద్ రజాక్, ధరావత్ హరిలాల్, గోర్ల సంపత్, ఇరుమల్ల అయిలయ్య, జాటోత్ తరుణ్, శ్రీరాముల రాజు, భూక్యా గోపాల్, తోర్రి మల్లేశం, చింతల రామచంద్రంలను నియమించినట్లు తెలిపారు.

గొర్రెల మందపై వీధికుక్కల దాడి



వీధికుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

దౌల్తాబాద్, జూలై 28: గొర్రెల మందపై వీధి కుక్కదాడి చేయడంతో 3 గొర్రెలు మృతి చెంది ఒక గొర్రెకు తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని ఇందుప్రియల్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. మండల పరిధిలోని ఇందుప్రియల్‌కు చెందిన తిప్పతి రాజయ్య గొర్రెలను మేత కోసం తీసుకెళ్లతున్న క్రమంలో వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో 3 గొర్రెలు మృతిచెందగా, ఒక గొర్రెకు తీవ్రగాయాలు అయ్యాయి

ఆత్మీయ సమ్మేళనం



గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94 లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి మిత్రులంతా ఒక చోట కలుసుకుని కష్టసుఖాలు పంచుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆటపాటలతో ఆడిపాడారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛలు అందజేసి సన్మానించారు.

-గజ్వేల్



చిన్నకోడూరు మండలం అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

-చిన్నకోడూరు

యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి

- టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రావు

గజ్వేల్, జూలై 28: యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు పేర్కొన్నారు. గజ్వేల్ మండలం జాలిగామలోని ఆయన నివాసంలో ఆదివారం యూత్ కాంగ్రెస్ ఎన్నికల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఎన్నికల కమిటీని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బల్మూరు వెంకట్ నర్సింగరావు, జిల్లా అధ్యక్షుడిగా చెట్టిపల్లి అనిల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బునారి రాజు, నియోజకవర్గ అధ్యక్షుడిగా కొత్తపేట కరుణాకర్‌రెడ్డి, గజ్వేల్ మండల అధ్యక్షుడిగా బాలయ్యగారి రాజు, వర్గల్ మండల అధ్యక్షుడిగా సల్మాన్‌హుస్సేన్, మర్కుక్ మండలాధ్యక్షుడిగా ప్రభుదాస్, కొండపాక మండల అధ్యక్షుడిగా కొంచెం రవి, జగదేవ్‌పూర్ మండల అధ్యక్షుడిగా దాసు, ములుగు మండల అధ్యక్షుడిగా మహేందర్, తూప్రాన్ మండల అధ్యక్షుడిగా కొండ శేషభూషణ్‌రెడ్డిలకు మద్దతు ప్రకటించారు. ఆయనవెంట నాయిని యాదగిరి, బెజుగామ గోపాల్‌రావు, తీగుల్ గ్రామ మాజీ సర్పంచ్ కొప్పెల భానుప్రకాశ్‌రావు, రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ కార్యదర్శి రాచకొండ ప్రశాంత్, ఎస్సీసెల్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, తీన్మార్ మల్లన్న టీం సభ్యుడు ఇమాంపూర్ యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చేయూతనివ్వడం కార్యకర్తల గొప్పతనం

- జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి

వర్గల్, జులై 28: నీరుపేదలకు చేయుతను అందించడం కాంగ్రెస్ కార్యకర్తల గొప్పతనమని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో స్థానిక గ్రామపంచాయతీ వద్ద ఆదివారం తాజా మాజీ ఉప సర్పంచ్ పసుల రమేశ్ ముదిరాజ్ అందజేసిన కనక దప్పులను వర్గల్, శాఖారం గ్రామానికి చెందిన పలువురికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద ప్రజలకు సేవ చేయడం కాంగ్రెస్ రక్తంలోనే ఉందని, అది నాయకుడైన, కార్యకర్త అయిన సమాజ సేవ చేయ్యాలని సంకల్పంతో ఉంటారన్నారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు మహేందర్‌గౌడ్, అయ్యగాల్ల ఎల్లయ్య, గణేశ్ చారి తదితరులు ఉన్నారు.

కొమురవెల్లి అంజయ్యకు తెలుగు సాహితీవనం జీవన సాఫల్య పురస్కారం



అవార్డు అందుకుంటున్న జర్నలిస్టు అంజయ్య

సిద్దిపేట అర్బన్, జూలై 28: సిద్దిపేట చెందిన కవి, సీనియర్ జర్నలిస్టు కొమురవెల్లి అంజయ్య తెలుగు సాహితీవనం జీవన సాఫల్య పురస్కారం(2024) అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన సంస్థ ఏడో వార్షికోత్సవంలో ఆయనకు ఈ విశిష్ట పురస్కారాన్ని అతిథులు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ రచయితలు, కవులు ఆడెపు లక్ష్మీపతి, ప్రజాశక్తి ఎడిటర్ సత్యజి, అంపశయ్య నవీన్, యండమూరి వీరేంద్రనాథ్, ఏనుగు నరసింహారెడ్డి, శాంతికృష్ణ, సందడి అరుణ, అనురాధ, నాలేశ్వరం శంకర్, పాతూరి అన్నపూర్ణ, తోట అరుణానాయుడు, గడ్డం శ్యామల, మౌనశ్రీ మల్లిక్ ,చమన్‌సింగ్, బిల్లా శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల మునిసిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్‌కు మాతృవియోగం



బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ చంటిని ఓదారుస్తున్న ఎమ్మెల్యే పల్లా

చేర్యాల, జూలై 28: చేర్యాల మునిసిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ మంగోలు చంటి మాతృవియోగం పొందారు. అతడి తల్లి మంగోలు పుష్ప (46) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందింది. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, టీఎస్ఎంఐడీసీ మాజీ చైర్మన్ ఎర్రోల్ల శ్రీనివాస్, మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, మాజీ ఎంపీపీలు మేడిశెట్టి శ్రీధర్, రామగల్ల పరమేశ్వర్, మాజీ జడ్పీటీసీ దాసరి కళావతి, కౌన్సిలర్లు చెవిటి లింగం, ఆడెపు నరేందర్, ముస్త్యాల తార, జుబేదా ఇక్బాల్, తుమ్మపల్లి లీల, నాయకులు ఏర్పుల మహేశ్, ముస్త్యాల బాలనరసయ్య, ముస్త్యాల కిష్టయ్య, పుర్మ వెంకటరెడి, ముస్త్యాల నాగేశ్వర్‌రావు, దాసరి శ్రీకాంత్, శివగారి అంజయ్యతో పాటు ఇతర పార్టీల నాయకులు, నేతలు సంతాపం వ్యక్తంచేశారు. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఫోన్‌లో మంగోలు చంటిని పరామర్శించారు. ఆమె అంత్యక్రియల్లో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, టీఎస్ఎంఐడీసీ మాజీ చైర్మన్ ఎర్రోల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.